

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	576 (271.6250)	20,467	20,467
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.68 (4.38)	456.82	333.24
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.882 (44.0354)	2,000	3,400

చికెన్ ధరలు | లైవ్ : రూ.160 | డ్రెస్ : రూ.240 | స్కిన్‌లెస్ : రూ.270



తుర్కపల్లిలో పోలింగ్ సామగ్రితో బయలుదేరిన సిబ్బంది

మొదటి విడతకు
నేడు పోలింగ్



భువనగిరిలో పోలింగ్ సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ హనుమంతరావు

- ఎన్నికల సామగ్రితో గ్రామాలకు తరలిన సిబ్బంది
- ఏకగ్రీవాలు మినహాయించి 137 గ్రామాల్లో పంచాయతీ పోరు
- 1,040 పోలింగ్ కేంద్రాలు.. 1,62,401 మంది ఓటర్లు
- పంపిణీ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ హనుమంతరావు

స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మొదటి విడత ఎన్నికలకు నేడు పోలింగ్ జరగనుంది. ఇందుకోసం అధికారులు జిల్లావ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు చేశారు. పలు పోలింగ్ కేంద్రాలను బుధవారం కలెక్టర్ హనుమంతరావు పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు.

(ఆంధ్రజ్యోతి-భువనగిరి రూరల్, కలెక్టరేట్)

జిల్లాలో మొత్తం 427 గ్రామపంచాయతీలు, 3,704 వార్డు స్థానాలు ఉన్నాయి. ఇందులో మొదటి విడతలో ఆరు మండలాల్లో 153 గ్రామపంచాయతీలకు, 1,286 వార్డులకు ఎన్నిక జరగనుంది. ఇందులో 16 సర్పంచ్ స్థానాలు, 243 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. ఏకగ్రీవాలు మినహాయించి 137 గ్రామ పంచాయతీలు, 1,040 వార్డులకు ఎన్నికల సామగ్రితో సిబ్బంది ఆయా గ్రామాల్లోకి బుధవారం బయలుదేరారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగుతుంది. రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలు వెల్లడిస్తారు. ఆ వెంటనే ఉపసర్పంచ్ ఎన్నిక ప్రక్రియను చేపట్టి స్థానిక ప్రభుత్వ పాలక వర్గాలను ఏర్పరచనున్నారు.

జిల్లాలోని ఆరు మండలాల్లో పోలింగ్

జిల్లాలో మొదటి విడతలో ఆత్మకూరు(ఎం), ఆలేరు, బొమ్మలరామారం, రాజాపేట, తుర్కపల్లి, యాదగిరిగుట్ట మండలాల్లో పోలింగ్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా మండల కేంద్రాల్లో బ్యాలెట్ బాక్స్‌లు, ఎన్నికల సామగ్రి పంపిణీ పూర్తి చేశారు.

అధికారులకు బాధ్యతలు

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికారులకు బాధ్యతలు అప్పగించారు. మొత్తం 1,177 బ్యాలెట్ బాక్సులు పంపిణీ చేశారు. జిల్లాలోని ఆరు మండలాల పరిధిలోని 137 గ్రామ పంచాయతీలతోపాటు 1,040 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులకు బాధ్యతలు అప్పగించారు. వారిలో 1,040 ప్రిసైడింగ్ ఆఫీసర్లు, 1,396 మంది ఓపీవోలు, 137 మంది స్టేజ్-2 రిటర్నింగ్ అధికారులతోపాటు 29 మంది జోనల్ అధికారులు, పలువురు రూట్ ఆఫీసర్లను నియమించారు. అదే విధంగా పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ క్యాస్టింగ్ నిర్వహించేందుకు మైక్రో అబ్జర్వర్లను ఏర్పాటు చేశారు. ఓటర్లకు పోలింగ్ రోజున గులాబీ రంగు కలిగిన బ్యాలెట్‌ను సర్పంచ్ స్థానాలకు, తెల్లరంగు కలిగిన బ్యాలెట్‌ను వార్డు స్థానాలకు కేటాయించారు.

జిల్లాలో మొదటి విడతలో...

మొత్తం పంచాయతీలు	153
ఏకగ్రీవమైన పంచాయతీలు	16
ఎన్నిక జరిగే సర్పంచ్ స్థానాలు	137
పోటీలో ఉన్న అభ్యర్థులు	411
వార్డు సభ్యుల స్థానాలు	1286
ఏకగ్రీవమైన వార్డులు	243
నామినేషన్లు రాని వార్డులు	3
ఎన్నికలు జరగాల్సిన వార్డులు	1,040

పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

యాదగిరిగుట్ట, ఆత్మకూరు(ఎం), తుర్కపల్లి మండలాల్లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను కలెక్టర్ హనుమంతరావు పరిశీలించి ఎన్నికల సామగ్రి, పోలింగ్ తదితర అంశాలకు సంబంధించి పలు సూచనలు చేశారు. పంపిణీ కేంద్రాల్లో పోలింగ్ సిబ్బందికి ఆయన మధ్యాహ్న భోజనాన్ని వడ్డించారు.

మొదటి విడతలో...

మండలం	గ్రామాలు	వార్డులు	ఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
ఆత్మకూర్(ఎం)	21	166	25,533	12,890	12,643	
ఆలేరు	15	128	21,537	10,501	11,035	1
బొమ్మలరామారం	31	222	29,503	14,631	14,871	1
రాజాపేట	21	182	30,236	14,972	15,224	
తుర్కపల్లి	28	173	27,877	13,846	14,131	
యాదగిరిగుట్ట	21	169	27,617	13,657	13,958	
మొత్తం	137	1040	1,62,401	80,497	81,902	2

జోరుగా పంపకాలు

- ఓటుకు నోటు... ఓటర్లకు తాయిలాలు
- కనిష్ఠంగా రూ.వెయ్యి, గరిష్ఠంగా రూ.5 వేలు
- గ్రామాల్లో పండుగ వాతావరణం



రాజాపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో ఎన్నికలు జరుగుతుండగా ఓటర్లకు అభ్యర్థులు తాయిలాలను జోరుగా అందిస్తున్నారు. చిన్న గ్రామపంచాయతీల్లో ఓటర్లు పరిమితిగా ఉండటంతో అభ్యర్థులు గెలుపుకోసం నానాతంటాలు పడుతున్నారు. పలు రకాలుగా పంపకాలు చేస్తూ ఆకర్షిస్తున్నారు. చికెన్, మద్యంతోపాటు చీరలు, వెండి కుంకుమ భరిణెలు, అభ్యర్థుల గుర్తులు కలిగిన ఉంగరాలు, కుర్చీలను పంపిణీ చేశారు. ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.2వేల వరకు పంపిణీ చేశారు. మండలంలో రిజర్వేషన్ తారుమారైన గ్రామాల్లో ఉప సర్పంచ్‌కోసం వార్డు సభ్యులకు పోటీ తీవ్రంగా ఉంది. రాజాపేట మండల కేంద్రంలోని కొన్ని వార్డుల్లో ఓటుకు రూ.5వేల వరకు నగదు పంపిణీచేసినట్లు తెలిసింది. అధికార కాంగ్రెస్ అభ్యర్థులతో పాటు, ప్రతిపక్ష బీఆర్ఎస్ మద్దతుదారులు, స్వతంత్రులు, కాంగ్రెస్ రెబల్స్ సైతం పోటాపోటీగా నగదు పంపిణీ చేశారు. కొన్నిచోట్ల మహిళా సంఘాలు, కులసంఘాల ద్వారా ఓటర్లకు నగదు అందజేశారు.



డీసీపీ అక్షాంశ్ యాదవ్

ఎన్నికలకు భారీ బందోబస్తు

- పోలింగ్‌కు, కౌంటింగ్‌కు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు
- మూడుదఫాల్లో 1,500 మంది సిబ్బందితో భద్రత
- 485 మంది రౌడీ షీటర్ల బైండోవర్
- డీసీపీ అక్షాంశ్‌యాదవ్

మూడు దఫాలుగా జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలకు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నామని రాచకొండ కమిషనరేట్ భువనగిరిజోన్ డీసీపీ అక్షాంశ్ యాదవ్ అన్నారు. శాంతి భద్రతలకు భంగం కల్పించినా, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కల్పించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'కి తెలిపిన వివరాలు ఆయన మాటల్లోనే..

(ఆంధ్రజ్యోతి-భువనగిరిటౌన్)

జిల్లాలో మూడు దఫాలుగా జరిగే పంచాయతీ ఎన్నికల్లో 1,500 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నాం. జిల్లాలోని అన్నిస్థాయిల పోలీస్ అధికారులు, సిబ్బంది విధుల్లో పాల్గొంటారు. స్ట్రైకింగ్ ఫోర్స్, సాయుధబలగాలు, స్థానిక పోలీసులు విధుల్లో ఉంటారు. పంపిణీ కేంద్రాలనుంచి బ్యాలెట్ బాక్సులు తిరిగి వచ్చేవరకూ వాహనాలకు ఎస్కార్ట్ టీములుతో భద్రత కల్పిస్తున్నాం. పోలింగ్, కౌంటింగ్‌కు ఆటంకం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందితో బెదిరింపులకు పాల్పడినా, దాడి యత్నాలు చేసినా, ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నించినా ఎన్నికల నిబంధనల మేరకు కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం.

16 అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు

జిల్లాలో 16 అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించాం. 11న జరిగే మొదటి దఫా ఎన్నికల్లో అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు లేవు. 14న జరిగే రెండో దఫా ఎన్నికల్లో ఆరు, 17న జరిగే మూడోదఫా ఎన్నికల్లో 10 అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఇక్కడ అదనపు బలగాలతో ప్రత్యేక భద్రత కల్పిస్తాం. వీటిలో జరిగే పోలింగ్‌ను వెబ్‌కాస్టింగ్ ద్వారా రాష్ట్ర ఎన్నికల కమిషన్ పర్యవేక్షిస్తుంది.

142 ఎక్సైజ్ కేసులు, 485 మంది రౌడీషీటర్ల బైండోవర్

పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటినుంచి జిల్లాలో ఇప్పటివరకు 142 ఎక్సైజ్ కేసులు నమోదుచేసి 1,600 లీటర్ల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నాం. 485 మంది రౌడీషీటర్లను బైండోవర్ చేశాం. జిల్లా సరిహద్దులో నాలుగు చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి తనిఖీలు చేస్తున్నాం. జిల్లా అంతటా నిరంతరం ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం. పంచాయతీ ఎన్నికల కోడ్ ముగిసే వరకూ జిల్లాలో ఇదే తరహా అప్రమత్తత కొనసాగిస్తాం.

ఏకగ్రీవాలపై నిర్దిష్ట ఫిర్యాదులు రాలేదు

జిల్లాలో పలు సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగతా పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం కొనసాగుతోంది. అయితే ఏకగ్రీవ ఎన్నికలపై పలు వదంతులు వచ్చినా, పోలీస్ శాఖకు నిర్దిష్టంగా ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. పోలింగ్ జరిగే ప్రాంతాల్లో బెదిరింపులు, ప్రలోభాలు కొనసాగితే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

విజయోత్సవాలకు అనుమతులు లేవు

మూడు విడతల ఎన్నికల్లో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్, 2గంటల నుంచి కౌంటింగ్ అనంతరం ఎన్నికల ఫలితాలు వెల్లడించాక ఉప సర్పంచ్ ఎన్నికను అక్కడే నిర్వహిస్తారు. అయితే గెలుపొందిన అభ్యర్థుల విజయోత్సవాలకు అనుమతులు లేవు. ర్యాలీలు, సభలకు ముందస్తు అనుమతి తప్పనిసరి. పోలింగ్ కేంద్రాల వద్ద అభ్యర్థులతోపాటు ఓటర్లు నిబంధనలు పాటించాల్సిందే.

పర్యావరణహితం.. పోలింగ్ కేంద్రం

పచ్చని మొక్కలు, పూల తోరణాలతో స్వాగతం పలుకుతున్న కేంద్రాలు



సైదాపురంలో ఏర్పాటు చేసిన పర్యావరణహితమైన పోలింగ్ కేంద్రం, ఎకో ఫ్రెండ్లీ బూత్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి (కలెక్టరేట్), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యావరణహిత పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల వద్ద పచ్చని మొక్కలు, పూలతో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించారు. ఆలేరు మండలం శారాజీపేట, ఆత్మకూరు(ఎం) మండలం సర్వేపల్లి, బొమ్మలరామారం మండలం పక్కీరుగూడెం, రాజాపేట మండలం నర్సాపూర్, తుర్కపల్లి మండలం రుస్తాపూర్, యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామాల్లో గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసినట్లు కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ప్లాస్టిక్‌రహిత వస్తువులను ఉపయోగించడం, పోలింగ్ కేంద్రం ప్రారంభంలో పూలతో అలంకరణ, బయటినుంచి బూత్‌వరకు పచ్చని మొక్కలు, కొబ్బరి తోరణాలతో స్వాగతం ఏర్పాటు చేశారు. వృద్ధులు, దివ్యాంగులకు వీల్‌చైర్ సౌకర్యం కల్పించారు. ఆలేరు మండలం శారాజీపేట, యాదగిరిగుట్ట మండలం సైదాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు.





పక్కీరుగూడెంలో ఏర్పాటు చేసిన కేంద్రం

జిల్లా అటవీ శాఖ అధికారిగా సుధాకర్‌రెడ్డి

- సిద్ధిపేటకు బదిలీ అయిన పద్మజారాణి



అటవీ శాఖ అధికారి సుధాకర్‌రెడ్డి

భువనగిరి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీ శాఖ అధికారిగా 2016 ఐఎఫ్ఎస్ బ్యాచ్‌కు చెందిన డి.సుధాకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఇప్పటివరకు జిల్లా అటవీ శాఖ అధికారిగా పనిచేసిన అదే బ్యాచ్‌కు చెందిన పద్మజారాణి సిద్ధిపేట జిల్లా అటవీ శాఖ అధికారిగా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు ఒకటి రెండు రోజుల్లో ప్రస్తుత అధికారి రిలీవ్ కానుండగా, నూతన అధికారి విధుల్లో చేరనున్నారు.

లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు



ఊరేగింపులో పాల్గొన్న అర్చకులు, ఈవో వెంకట్రావు

యాదగిరిగుట్ట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్యపూజలు వైభవంగా కొనసాగాయి. సుప్రభాతంతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకించి తులసీదళాలతో సహస్రనార్చనలు జరిపారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవారిని అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విశ్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణపర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్యపూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.14,26,521 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు.

ప్రచారరథ యాత్ర ఆంధ్రప్రదేశ్‌కు విస్తరించాలి

స్వామివారి ప్రచార రథాన్ని తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని ముఖ్య ప్రాంతాలకు విస్తరించాలని ఈవో వెంకట్రావు అన్నారు. కొండపై ప్రధాన కార్యాలయంలో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తితో కలిసి బుధవారం అధికారులతో ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. ప్రచార రథం ద్వారా స్వామివారి చరిత్ర, మహిమలు దేవస్థాన అభివృద్ధిపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఏఈవో జూశెట్టి క్రిష్ణ నోడల్ అధికారిగా 2026 జనవరి 3న జగ్గయ్యపేటలో స్వామి కల్యాణం నిర్వహించేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. ఏఈవో నాగుల మహేష్ గౌడ్ నోడల్ అధికారిగా 2026 జనవరి 6న పిడుగురాళ్లలో నిర్వహించాలన్నారు. ఇటీవల ప్రారంభించిన అన్నదానసత్రంలో భక్తులు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో ఏఈవోలు జూశెట్టి క్రిష్ణ, గజ్వేల్లి రఘు, నాగుల మహేష్‌బాబు, ప్రధానార్చకులు కాండూరి వెంకటాచార్యులు, భట్టర్ సురేంద్రాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడితే చర్యలు

- విజిలెన్స్ అధికారి ఎస్‌కే గౌస్



తూకాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారి గౌస్

రామన్నపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారి ఎస్‌కే గౌస్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని నీర్నేముల, శోభనాద్రిపురం గ్రామాల్లోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను విజిలెన్స్ బృందంతో కలిసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యాన్ని లారీల్లో లోడు చేసిన వెంటనే ట్రక్‌షీట్ ఇచ్చి పంపించాలని సూచించారు. ఆయనవెంట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మనోహర్, జిల్లా తూనికల కొలతల అధికారి కె. వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

మానవ హక్కులను కాపాడుకోవాలి


ఘనంగా జాతీయ మానవ హక్కుల దినోత్సవం



బహుమతి అందజేస్తున్న అంజిరెడ్డి

భువనగిరి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తహసీల్దార్ ఎన్.అంజిరెడ్డి అన్నారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో బుధవారం భువనగిరిలో నిర్వహించిన మానవ హక్కుల దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మానవ హక్కులతోపాటు బాధ్యతలను కూడా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. జాగృతి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌బీ మల్లేశం, ఎండీ ఇస్తియాక్, ఎండీ ఇంతియాజ్, కొడారి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో భువనగిరి సబ్ జైలులో మానవ హక్కులపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కట్టా భూపాల్‌రెడ్డి, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ బొమ్మ వెంకటేశ్ పాల్గొన్నారు.

లోటుపాట్లు లేకుండా సామగ్రి పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న నవీన్‌కుమార్

తుర్కపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సిబ్బందికి పోలింగ్ సామగ్రిని పంపిణీ చేసినట్లు కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. మొదటి విడత పోలింగ్ ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించి, సామగ్రి పంపిణీ తీరుతెన్నులను ఆయన పరిశీలించి మాట్లాడారు. పోలింగ్ సిబ్బందికి చెక్ లిస్ట్ ఆధారంగా ఎన్నికల నిర్వాహణకు అవసరమైన సామగ్రి అందిందా? లేదా? అని పరిశీలించుకోవాలన్నారు. ఈ సందర్భంగా పోలింగ్ సిబ్బందికి కలెక్టర్ భోజనం వడ్డించారు. ఆయనవెంట మండల ఎన్నికల ఇన్‌చార్జి గుర్రం సురేశ్, ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, తహసీల్దార్ జలకుమారి, ఎంఈవో వి.మాలతి ఉన్నారు.

ఆలేరు రూరల్: గ్రామపంచాయతీ మొదటి విడత ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా అన్ని ఏర్పాట్లు చేశామని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. ఆలేరు మండలం శారాజీపేటలో ఏర్పాటు చేసిన గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలేరు మండలంలోని శారాజీపేట, ఆత్మకూరు మండలం సర్వేపల్లి, బొమ్మలరామారం మండలం పక్కీర్‌గూడెం, రాజాపేట మండలం నర్సాపూర్, యాదగిరిగుట్ట మండలం సైదాపూర్ గ్రామాల్లో గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి స్వప్న, తదితరులు ఉన్నారు.

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట మండలంలో ఈ నెల 11న జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా అసిస్టెంట్ ఎన్నికల అధికారి నవీన్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన యాదగిరిగుట్టలో విలేకరులతో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు మీడియాకు సమాచారం అందజేస్తామని, పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి లేదని ఆయన చెప్పారు.

జెండా పట్టలే.. జై కొట్టలే

● అయినా అభ్యర్థిత్వం ఖరారు ● అసంతృప్తితో బరిలో పాతకాపులు

గ్రామపంచాయతీ ఎన్నికల సిత్రాలు చిత్రవిచిత్రంగా సాగుతున్నాయి. పార్టీలకతీతంగా జరగాలనో, ఎన్నికల నిబంధనలు పాటించాలనో, మరెందుకో గానీ ఏనాడూ జెండా పట్టని కొందరికి చివరి నిమిషంలో అభ్యర్థిత్వాలు ఖరారయ్యాయి. పార్టీకి, అగ్రనాయకులకు జై కొట్టని వారు జట్టులో కలిసిపోయారు. ఏళ్ల తరబడి ఎన్నికల కోసం ఎదురు చూసిన నాయకుల్లో కొందరికి భంగపాటు తప్పలేదు.



● మిర్యాలగూడ టౌన్, ఆంధ్రజ్యోతి

సర్పంచ్ అభ్యర్థిత్వం తమకే దక్కుతుందని భావించి భంగపడిన వారు ఇండిపెండెంట్‌గా బరిలో నిలుస్తున్నారు. దీంతో గ్రామపంచాయతీల్లో పంచాయితీలు జరుగుతున్నాయి. సుదీర్ఘకాలంగా పార్టీకి, ప్రజలకు సేవలందించిన వారిని కాదని, కొత్తగా, కొంగొత్తగా పార్టీలో చేరిన వారిని ఆయా రాజకీయపార్టీలు అక్కున చేర్చుకుంటుండడంతో పార్టీ కార్యకర్తలు పెదవి విరుస్తున్నారు. ఇక సదరు అసంతృప్తి నాయకుడు బరిలో నిలిచి అసలు, సిసలు అభ్యర్థికి సవాల్ విసరడం కొత్త ఇబ్బందులు తెచ్చి పెడుతోందని పార్టీ పెద్దలు తల పట్టుకుంటున్నారు.

అసలు ఒకరు.. కొసరు ఒకరు

రెండో విడత ఎన్నికలు జరగనున్న గ్రామపంచాయతీల పరిస్థితిని గమనిస్తే.. పలు చోట్ల ఇద్దరేసి అభ్యర్థులు(ఒకే పార్టీకి చెందిన) బరిలో ఉన్నారు. ఇద్దరూ పార్టీ అభ్యర్థిత్వం కోసం ఎదురు చూసినా ఒకరికి షేక్‌హ్యాండ్, మరొకరికి హ్యాండివ్వడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని గ్రామాల్లో చర్చ జరుగుతోంది. అయితే అవకాశాలు, బలాబలాలు సమానం ఉన్నాయని, పైసిచ్చిన వారిదే పై చేయిగా ఉంటుందని నిక్కచ్చిగా చెబుతుండటం ఆశ్చర్యాన్ని కలిగించే విషయం.

సామాజిక సమీకరణల కారణంతోనేనా..?

పార్టీలకతీతంగా నిర్వహించాల్సిన స్థానిక సంస్థల ఎన్నికలపై సామాజిక సమీకరణలు ప్రభావం చూపుతున్నాయి. గెలుపోటముల సంగతి అటుంచితే.. అభ్యర్థుల ఖరారులో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. కొన్ని గ్రామాల్లో ఆర్థిక కోణం నుంచి అభ్యర్థులను ఖరారు చేసిన నేతలు, మరి కొన్ని గ్రామాల్లో సామాజిక సమీకరణలు చూస్తున్నారు.

ఆ గట్టునుండాలా.. ఈ గట్టునుండాలా..?

అధికారం కోల్పోయి అవకాశం కోసం చూస్తున్న పార్టీలు అసంతృప్తులను అక్కున చేర్చుకుంటున్నాయి. ఈ తరుణంలో గ్రామ ఓటర్లు ఆ గట్టునుండాలా.. ఈ గట్టుకు చేరాలా అని అయోమయానికి గురవుతున్నారు. మొన్నటి వరకూ ఆదే పార్టీ జెండా వేసుకుని అతని వెంట తిరిగిన అనుచరులు, అమాంతం ప్రతిపక్ష పార్టీతో అంటకాగడం తమ వల్ల కాదంటుండగా, అందరినీ సమన్వయ పరచడంలో తలమునకలవుతున్నారు పార్టీ పెద్దలు.

విచిత్ర అవగాహనలు

● కొన్నిచోట్ల ప్రత్యర్థులు, మరికొన్ని చోట్ల స్నేహ హస్తం



డిండి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో అధికార, విపక్ష పార్టీల మధ్య కుదిరిన అవగాహన విచిత్రంగా ఉంది. కొన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు అవగాహనకు రాగా, మరికొన్ని గ్రామాల్లో ఇరు పార్టీలకు చెందిన అభ్యర్థులు ప్రత్యర్థులుగా బరిలో ఉన్నారు. మండలంలోని వావిల్‌కోల్ కాంగ్రెస్ పార్టీ తిరుగుబాటు అభ్యర్థికి బీఆర్‌ఎస్ నాయకులు మద్దతు పలికారు. ఇదే తరహాలో బొలనపల్లి కాంగ్రెస్ పార్టీ తిరుగుబాటు సర్పంచ్ అభ్యర్థికి బీఆర్‌ఎస్ నాయకులు మద్దతుగా ఉన్నారు. మండలంలో విలక్షణ, విచిత్రమైన అవగాహన ఉంది. గ్రామపంచాయతీ ఎన్నికల్లో కలిసి పోటీ చేసేందుకు కాంగ్రెస్, సీపీఐ అవగాహన కుదుర్చుకున్నాయి. మండలంలో 39 పంచాయతీలు ఉండగా పొత్తులో భాగంగా సీపీఐ గోనకోలు, ఖానాపూర్, కందుకూరు, రామాంతపూర్ గ్రామాల్లో పోటీ చేస్తుండగా, ఖానాపూర్, గోనకోలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థులు బరిలో దిగారు. దీంతో గోనకోలు పంచాయతీ నుంచి నామినేషన్ దాఖలు చేసిన సీపీఐ అభ్యర్థి తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. మండలంలోని కందుకూరు, వావిల్‌కోల్, వీరబోయినపల్లి, డిండి గ్రామాల్లో బీజేపీ అభ్యర్థులను నిలిపింది. కామేపల్లి, రామాంతపూర్, దేవత్‌పల్లి తండాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌కు మద్దతు ప్రకటించారు. ఎర్రగుంటపల్లి పంచాయతీలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య అవగాహన కుదిరింది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి బీజేపీ మద్దతు ప్రకటించింది. డిండిలో సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన ఇద్దరు బీజేపీ అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు.

పల్లె పాలన.. పాఠశాలలో బోధన

● ఎన్నికల నేపథ్యంలో గ్రామపంచాయతీ పాలనపై విద్యార్థుల ఆసక్తి



భువనగిరి రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన సర్పంచ్, వార్డు సభ్యులు, ఉప సర్పంచ్ బాధ్యతలు ఏమిటనేది పెద్దలకు తెలుసు. విద్యార్థులకు ప్రాథమిక దశలోనే వారికి కూడా తెలవాలనే తరగతి గదిలో పల్లె పాలన తీసుకొచ్చినట్లుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 11, 14, 17 తేదీల్లో పంచాయతీ పోరుకు రంగం సిద్ధమైంది. ప్రతిరోజూ బడికి వెళ్తున్న పిల్లలు గ్రామాల్లో ఎన్నికల కోలాహలం చూసి.. 6వ తరగతి సాంఘిక శాస్త్రంలో గ్రామపంచాయతీల పాఠం ఉందని పేజీలు తిరగేస్తున్నారు. విద్యార్థుల కోరిక మేరకు ఉపాధ్యాయులు బోధిస్తుండడం విశేషం.

విద్యార్థులకు అవగాహన కోసం..

ప్రజాస్వామ్యం, గ్రామపంచాయతీ విధులు, సిబ్బంది కర్తవ్యం, ఓటు హక్కు తదితర అంశాలపై ఈ పాఠం బాల్యంలోనే అవగాహన కలిగిస్తుంది. గ్రామసభ, ఓటర్ల జాబితా, వార్డులు, రిజర్వేషన్లు ఎన్నికల నిర్వహణతో పాటు పాలకవర్గం, పంచాయతీ కార్యదర్శుల విధులు తదితర అంశాల వారీగా పొందుపరిచారు. ఎన్నికల పాఠం గురించి చర్చిస్తుండడంతో ఆసక్తి గల పాఠమైంది. పాలకవర్గాలకు ఉండే అధికారాల గురించి విద్యార్థులు తెలుసుకుంటున్నారు.


ఈ సారి దగ్గరుండి చూస్తా



మా ప్రాంతంలో ఈ నెల 11న పంచాయతీ ఎన్నికలు జరుగుతాయి. తరగతి గదిలో పాఠం విన్న ఎన్నికలు జరిగే రోజు దగ్గరుండి చూస్తున్నా. ఇప్పటికే కొందరు మా ఇంటికి వచ్చి ఓట్లు అడిగారు. ఎవరికి ఓటు వేస్తారని అమ్మానాన్నను అడిగితే బయటకు చెప్పకూడని విషయమని చెప్పారు.

● ఏ. అనీష్, 6వ తరగతి విద్యార్థి

బ్యాలెట్ గురించి తెలుసుకున్నా



సాధారణ ఎన్నికలప్పుడు తల్లిదండ్రులతో కలిసి సమీపంలో ఉన్న పోలింగ్ కేంద్రానికి వెళ్లా అక్కడ ఒక మిషన్ ఈవీఎంను చూశా. ఇప్పుడు పుస్తకంలో మాదిరి బ్యాలెట్ ముద్రించి ఉండడం చూసి అడిగి తెలుసుకున్నా. స్వస్తిక్ ముద్ర గురించి కూడా ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు.

● కె. సారిక, 6వ తరగతి

హోం ఓటింగ్ లేనట్టే

● అసెంబ్లీ ఎన్నికల్లో దివ్యాంగులు, 85 ఏళ్లుపైబడిన వృద్ధులకు హోం ఓటింగ్ ● పంచాయతీ ఎన్నికల్లో అవకాశం లేదు

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగం అత్యంత ప్రధానమైనది. ఓటు ద్వారా ఐదేళ్లు పాలించే పాలకులను ఎన్నుకుంటారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నది ఎన్నికల సంఘం లక్ష్యం. అందుకోసం ఎన్నికల కమిషన్ ఎప్పటికప్పుడు ఏర్పాట్లు చేస్తుంది. ఓటు హక్కుపై అవగాహన కల్పించడం, పోలింగ్ కేంద్రాల ఆవరణలో వీల్‌చైర్లు అందుబాటులో ఉంచడం, వీల్‌చైర్‌లో దివ్యాంగులు, అనారోగ్యం, వృద్ధాప్యంతో నడవలేని వారిని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లడానికి సిబ్బందిని ఏర్పాటు చేస్తుంది.



● ఆంధ్రజ్యోతి, మోత్కూరు

దివ్యాంగులు, వృద్ధులు, అనారోగ్యంతో నడవలేక పోలింగ్ కేంద్రాల వద్దకు కూడా వెళ్లలేని వారి కోసం ఎన్నికల కమిషన్ గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ప్రత్యేక ఏర్పాటు చేసింది. దివ్యాంగులు, అనారోగ్య బాధితులు, 85ఏళ్ల పైబడిన వృద్ధులు ముందుగా దరఖాస్తు తీసుకుని, ఎన్నికల అధికారులను వారి ఇంటి వద్దకు పంపి బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించారు. దాంతో కొంత ఓటింగ్ శాతం పెరిగిందంటారు. ఇప్పుడు జరుగుతున్న పంచాయతీ పోరులో మాత్రం ఆ అవకాశం లేకుండాపోయింది. వృద్ధులు, దివ్యాంగులు, నడవలేని స్థితిలో ఉన్న ఓటర్ల గతంలో లాగా ఇంటి వద్ద ఓటు వేసే అవకాశం లేకపోవడంతో తాము పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేం కదా తాము ఓటు వేయకుండా ఉండాల్సిందేనా అని మదన పడుతున్నారు.

పోలింగ్ సమయం కూడా తక్కువే

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ నెల 11, 14, 17వ తేదీల్లో మూడు విడతలుగా పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయి. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలప్పుడు పోలింగ్ ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుంది. అప్పుడు సమయం ఎక్కువగా ఉంటున్నందున నడవలేని వారిలో కొందరైనా మధ్యమధ్య విశ్రాంతి తీసుకుంటూ మెల్లగా వెళ్లి ఓటు వేసే అవకాశముండేది. పంచాయతీ ఎన్నికల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకే పోలింగ్ జరుగుతున్నందున సమయం తక్కువ కాబట్టి నడవలేని వారు ఓటు వేసే అవకాశం తక్కువంటున్నారు. అభ్యర్థులు ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించకూడదు. వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో నడువలేని వారు గ్రామానికి పదిఇరవై మంది అయినా ఉంటారు. వారు గతంలో తమ ఇంటి వద్దకు వచ్చి ఓటు వేయించుకున్న అధికారులు ఇప్పుడెందుకు రారని ప్రశ్నిస్తున్నారు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో



వృద్ధులు, దివ్యాంగులు, ఇతర నడవలేని స్థితిలో ఉన్నవారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఎన్నికల సంఘం కొంత కాలంగా హోం ఓటిం గ్ విధానాన్ని అమలు చేస్తున్నది. రెండేళ్ల క్రితం జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో కూడా ఓటరు జాబితా ప్రకారం 85ఏళ్ల పైబడిన వృద్ధులు, 40శాతం పైగా వైకల్యం కలిగిన దివ్యాంగులు, పక్షవాతం లాంటి అనారోగ్య సమస్యతో నడువలేని వారికి ఇంటి వద్దనే ఓటు వేసే వెసులుబాటు కల్పించింది. ఇంటి వద్ద ఓటు వేయడం కోసం ప్రత్యేకంగా రూపొందించిన 12-డీ ఫామ్‌ను వివరాలతో పూర్తిచేసి రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకుంటే వారు పరిశీలించి అర్హులైన వారికి ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం కల్పించారు. ఇప్పుడా అవకాశం లేక పోవడంతో కొందరు ఓటింగ్‌కు దూరమవుతారని భావిస్తున్నారు. ఈ విషయమై స్థానిక ఎన్నికల అధికారులను అడిగితే ఇప్పుడు అలాంటి అవకాశం లేదని, ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించడం తప్ప తమచేతుల్లో ఏముందంటున్నారు.

మఠంపల్లి మండలంలో మృతులకూ.. ఓటుహక్కు

● తప్పులతడకగా ఓటరు జాబితా

మఠంపల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో ఓటర్ల జాబితా తప్పుల తడకగా తయారైంది. మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో ఏడాది క్రితం మృతిచెందిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించలేదు. గుర్రంబోడుతండా, పెదవీడు, రామచంద్రాపురంతండా, బీల్యానాయక్ తండా, చెన్నాయిపాలెం, చౌటపల్లి, మఠంపల్లి, రఘునాథపాలెం, తుమ్మలతండా, మంచ్యాతండా, కాల్వపల్లితండా, దొనబండతండా, యాతవాకిళ్ల తదితర గ్రామాల్లో ఏడాది క్రితం మృతిచెందిన వారి పేర్లు కూడా ఓటరు జాబితాలో ఉన్నాయి. ఈ ఏడాది జూలై ఒకటో తేదీ నాటికి జాబితా క్రమబద్ధీకరించినట్లు అధికారులు పేర్కొంటున్నా ఎలాంటి మార్పులు కనిపించడం లేదు. ఎన్నికలకు ముందు రెవెన్యూ, బూత్ లెవల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించినందునే ఈ సమస్య తలెత్తింది. మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లోని ఓటరు జాబితాల్లో మొత్తం 300కు పైగా మృతి చెందిన వారి పేర్లు ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి మృతుల పేర్లను తొలగించి దొంగ ఓట్లు వేయకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ మంగను వివరణ కోరగా బూత్ లెవల్ అధికారులకు ఇటీవల ఆదేశాలు జారీ చేశామన్నారు. మృతుల పేర్లను తమ దృష్టికి వస్తే తొలగిస్తానన్నారు. దొంగ ఓట్లు వేయకుండా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.



మఠంపల్లి మండలంలో ఓటరు జాబితాలో చనిపోయిన వారి పేర్లు

గ్రామాన్ని అభివృద్ధి చేసే వారినే గెలిపిస్తాం

నల్లగొండ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారం ముగియడంతో ఓటు వేసేందుకు అంతా సిద్ధమయ్యారు. నిన్నటి వరకు ప్రచారం హోరెత్తించిన అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసేందుకునేందుకు ఎత్తుగడలు వేశారు. గ్రామంలో ఉన్న మహిళలను పకరిస్తే గ్రామంలో అభివృద్ధి చేసేవారినే ఎన్నుకుంటామని చెప్పారు. గ్రామంలో అభివృద్ధి జరిగితేనే అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. ఇన్ని రోజులు ప్రచారం చేసిన అభ్యర్థులు కూడా రైతులు వ్యవసాయ పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చిందే తరువాయి అభ్యర్థులు వెంటనే అక్కడ వాలిపోయి ఓటు అభ్యర్థించారు. గ్రామంలో గట్టి పోటీ ఉండడంతో గ్రామానికి చెందిన ఓటర్లు పట్టణాల్లో ఉండడంతో వారిని ఒప్పించేందుకు అనుచరులను పంపారు. ఓటు వేసేందుకు వచ్చే సౌకర్యాలు కల్పిస్తామని తమ వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేశారు. ఎన్నికలు అత్యంత కీలకంగా మారడంతో అభ్యర్థులు అన్ని ప్రయత్నాలు చేశారు. ఎలాగైనా గెలవాలని ప్రతి ఓటరును కలిశారు. గ్రామాన్ని అభివృద్ధి చేసే హామీతోనే ఓటు వేస్తామని ఓటర్లు సైతం చెప్పుకొచ్చారు.



గ్రామంలో నిర్మానుష్యంగా ఉన్న వీధి



ఇంటి వద్ద కూర్చున్న మహిళలు

పంచాయతీ ఫలితాలపై జోరుగా బెట్టింగులు

భువనగిరి టౌన్, డిసెంబరు 10,(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో గెలుపు పలువురు అభ్యర్థులకు ప్రతిష్టాత్మకంగా మారింది. సర్పంచ్, వార్డు సభ్యులకు పోటీ పడుతున్న ఆశావహులు గెలిస్తే దక్కే రాచ మర్యాదలకంటే ఓడిపోతే ఎదురయ్యే అవమానాన్ని ఊహించుకుంటూ దిగాలు పడుతున్నారు. దీంతో విజయం కోసం పలు రీతుల్లో ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. క్రికెట్ మ్యాచ్, ఎన్నికల ఫలితాలపై సర్వసాధారణమైన బెట్టింగ్‌లను కూడా తమ ప్రచారానికి ఆయుధంగా వాడుకుంటూ ఎన్నికల ప్రచారంలో నూతన ఒరవడికి దారి తీయడం గమనార్హం. ఇప్పటివరకు ఎన్నికల ఫలితాలపై కొద్దిమంది బెట్టింగ్ కాస్తూ సొమ్ము చేసుకునేవారు. కానీ గ్రామపంచాయతీ ఎన్నికల్లో బెట్టింగ్‌లలో కొందరు అభ్యర్థులు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. ఎన్నికల బరిలో ఉన్న కొద్దిమంది అభ్యర్థులు తమ అనుచరుల ద్వారా తమ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుస్తున్నాడంటూ గ్రామాల్లోని చౌరస్తాలు, చాయ్, కల్లు అడ్డాలు వద్ద బెట్టింగ్‌లు కాయిస్తున్నారు. బెట్టింగ్ కాస్తున్న సొమ్మును కూడా ఆయా అభ్యర్థులే అందిస్తూ కమిషన్లు కూడా ఇస్తున్నారు.

ప్రతి ఓటూ కీలకమే

● స్వల్ప ఓట్ల తేడాతో ఫలితాలు తారుమారు

సంస్థాన్ నారాయణపురం, వలిగొండ, డిండి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత కీలకంగా ఉంటాయి. పార్టీల పరంగా కాకుండా వ్యక్తుల పరంగా కొంత ప్రాధాన్యం ఇస్తారు. ప్రతి ఓటూ విలువైనదిగా భావిస్తారు. ఏ ఒక్క ఓటు వదులుకున్న జయపజయాలు తారుమారవుతాయి యాదాద్రిభువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం గ్రామపంచాయతీకి 2019 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఉప్పల లింగస్వామి ఒక్క ఓటు తేడాతో ఓటమిపాలయ్యారు. కాంగ్రెస్ తరుపున పోటీ చేసిన ఉప్పల లింగస్వామికి 1828 ఓట్లు పోలయ్యాయి. బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసిన శికిలంమెట్ల శ్రీహరికి 1829 ఓట్లు పోలయ్యాయి. ఉత్కంఠంగా జరిగిన కౌంటింగ్‌లో ఒక్క ఓటు తేడాతో ఉప్పల లింగస్వామి విజయాన్ని చేజార్చుకోగా, శిఖిలమెట్ల శ్రీహరి గెలుపొందారు.

● యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని గోపరాజుపల్లికి చెందిన సర్పంచ్ అభ్యర్థి కీసర్ల ఉపేంద్ర 14ఓట్లతో గెలుపొందారు. వార్డు సభ్యులుగా టేకులసోమారానికి చెందిన పడమటి లత, మందడి వసంత ఒక్క ఓటు తేడాతో ఓటమి పాలయ్యారు.

● నల్లగొండ జిల్లా డిండి మండలంలోని ప్రతాప్‌నగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జర్పుల లక్ష్మీ బీఆర్‌ఎస్ అభ్యర్థిపై 4 ఓట్ల తేడాతో గెలుపొందారు.

తూర్పుపల్లిలో అన్నాదమ్ముళ్ల సవాల్

దేవరకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం తూర్పుపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ పదవికి బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నుంచి అన్నదమ్ముళ్లు నామినేషన్లు దాఖలు చేసి ఎన్నికల బరిలో నిలిచారు. తూర్పుపల్లికి చెందిన నాగవరం నిర్మల్‌రావు కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో ఉండగా, ఆయన తమ్ముడు నాగవరం వెంకటేశ్వరరావు బీఆర్‌ఎస్ నుంచి పోటీలో ఉన్నారు. జనరల్ స్థానమైన తూర్పుపల్లిలో అన్నాదమ్ముళ్లు పోటీపడుతున్నారు.

అడ్లూరు సర్పంచ్ బరిలో బావమరదలు

చింతలపాలెం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం అడ్లూరు గ్రామంలో బావ, మరదలు సర్పంచ్ అభ్యర్థులుగా తలపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థిగా జెట్టి నాగిరెడ్డి బరిలో ఉండగా, బీఆర్‌ఎస్ మద్దతుతో ఆయన మరదలు జెట్టి కావ్య పోటీ చేస్తున్నారు. గ్రామంలో మొత్తం 530మంది ఓటర్లు ఉన్నారు. ఓటర్లు మద్దతు కూడబెట్టేందుకు ఇద్దరు అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

దాత ఇచ్చిన భూమి మినీ స్టేడియానిదే

● ఆ భూమిపై సింగిల్ జడ్జి తీర్పును కొట్టివేసిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

మోత్కూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరులో అన్యాక్రాంతమైన రూ.కోట్ల విలువ చేసే మినీ స్టేడియం భూమి హైకోర్టు తీర్పుతో తిరిగి స్టేడియానికి దక్కింది. 2005లో అప్పటి ఎమ్మెల్యే ఉప్పునూతల పురుషోత్తమరెడ్డి కోరిక మేరకు మోత్కూరులో ఇండోర్ స్టేడియం నిర్మాణానికి స్థానిక సేక్రెడ్ హార్ట్ హైస్కూల్ అప్పటి ప్రిన్సిపాల్ ఫాదర్ బాలశౌరి తమ పాఠశాల సమీపంలోని సర్వేనంబర్లు 859, 860, 861 మింజుంలేలో ఆరు ఎకరాల భూమిని ఎకరం రూ.50 వేల చొప్పున కొనుగోలు చేశారు. ఆ భూమిని ప్రభుత్వానికి ఇచ్చేదే అయినందున ఫాదర్ బాలశౌరి తన పేరున రిజిస్ట్రేషన్ చేసుకోకుండా తనకు భూమి విక్రయించిన రియల్‌ఎస్టేట్ వ్యాపారులు రవికుమార్, బిక్షమయ్యతో నేరుగా ఆ భూమిని ప్రభుత్వానికి అప్పగిస్తూ 2005 ఫిబ్రవరి 2వ తేదీన మోత్కూరు ఎంఆర్‌వో వద్ద ఆ భూమిపై వారి హక్కులకు రాజీనామా చేయించారు. 1951 రెవెన్యూ చట్టం రూల్-16 ప్రకారం ఫామ్-సిపై సంతకాలు చేసి రిలిన్‌క్విష్‌మెంటు చేయించారు. దీంతో ఆ భూమి యజమానులు తమ హక్కులు కోల్పోగా, ఆ భూమిపై పూర్తి హక్కులు ప్రభుత్వానికి సంక్రమించాయి. భూ యజమానులైన రవికుమార్, బిక్షమయ్య భూమిని గిఫ్ట్‌గా ఇవ్వలేదు, రిలిన్‌క్విష్ చేశారు. 2005లోనే అప్పటి ఎంఆర్‌వో జె. దేవపాలన్ ఆ భూమిని అమైండ్‌మెంట్ చేశారు. ఆనాటి నుంచి రెవెన్యూ రికార్డుల్లో అది ప్రభుత్వ భూమిగా వస్తోంది. మోత్కూరుకు కస్తూర్బా పాఠశాల మంజూరు కాగా వేరే చోట ప్రభుత్వ స్థలం లేక ఈ ప్రభుత్వ భూమిలోంచి రెండెకరాలు కేటాయించగా అందులో కస్తూర్బా పాఠశాల నిర్మించారు. మిగతా భూమి నాలుగు ఎకరాలు ఇండోర్ స్టేడియం కోసం ఉంచారు. భూముల ధరలు బాగా పెరగడంతో ఆ భూమిపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్ను పడింది. స్థానిక రియల్ ఎస్టేట్ వ్యాపారులు 2005లో సదరు భూమిపై రిలిన్‌క్విష్(రాజీనామా)చేసిన యాజమాని రవికుమార్‌తో కుమ్మక్కై అక్కడ ఇండోర్ స్టేడియం నిర్మించనందున తమ భూమి తిరిగి ఇవ్వాలని 2014లో హైకోర్టులో రిట్‌పిటిషన్ వేయించారు. తహసీల్దార్లు మారుతుండటం, స్థానిక ప్రజా ప్రతినిధులు ఈ భూమి కోర్టు కేసును పట్టించుకోకపోవడంతో హైకోర్టు సింగిల్ బెంచ్ జడ్జి 2024న నవంబరు 21వ తేదీన పిటిషనర్‌కు అనుకూలంగా తీర్పు చెప్పారు. దానిపై అప్పీలుకు వెళ్లడానికి 8 వారాల గడువు ఇచ్చారు. దీంతో మోత్కూరు మునిసిపల్ కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి హైకోర్టులో రిట్‌పిటిషన్(పిల్) (నం.12 ఆఫ్ 2025) వేశారు. దానిపై విచారణ జరిపిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, మరో న్యాయమూర్తి ఈ నెల 8న ఆ భూమి స్టేడియం(ప్రభుత్వాని)కే చెందుతుందని తీర్పు చెప్పారు. గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును కొట్టి వేశారు.

ఆలేరులో షార్ట్‌సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధం

ఆలేరు, డిసెంబరు 10,(ఆంధ్రజ్యోతి): షార్ట్‌సర్క్యూట్‌తో పెంకుటిల్లు దగ్ధమైంది. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డులో జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంగి యల్లయ్యకు చెందిన పెంకుటింట్లో మంగళవారం రాత్రి అతని కుమారుడు శివ ఒక్కడే నిద్రించాడు. ఆ సమయంలో ఇంట్లో తల్లిదండ్రులు, పిల్లలు ఎవరూ లేరు. అర్ధరాత్రి దాటిన తర్వాత మూడు గంటల ప్రాంతంలో శివ మేల్కొనగా ఇల్లంతా పొగతో నిండింది. భయపడిన శివ కేకలు వేస్తూ బయటికి వచ్చాడు. దీంతో ఇరుగుపొరుగు వెంటనే అక్కడికి చేరుకొని ఏం జరిగిందని అడిగితే ఇంట్లో పొగలు వస్తున్నాయని చెప్పాడు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అలాగే విద్యుత్ అధికారులకు కూడా సమాచారమిచ్చి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. యాదగిరిగుట్ట ఫైర్‌స్టేషన్ ఫైర్‌మన్ అమిద్ సిబ్బందితో అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో చుట్టుపక్కల ఇళ్లకు ప్రమాదం తప్పింది.



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

మద్యం పట్టివేత

వలిగొండ, డిసెంబరు 10, (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలంలోని గొల్నేపల్లి గ్రామానికి చెందిన బోరుగు యాదగిరి కిరాణం దుకాణం నడుపుతున్నాడు. బుధవారం పోలీసులు స్థానిక తొర్రూర్ క్రాస్ రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా బ్యాగ్‌లో మద్యం బాటిళ్లను తీసుకెళ్తున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. బ్యాగ్‌లో ఆరు బీర్లు, రెండు హాఫ్ బాటిళ్లు, 11క్వార్టర్లు, పది 90ఎంఎల్ బాటిళ్లు ఉన్నట్లు గుర్తించారు. 7.53లీటర్ల మద్యం దాని (విలువ సుమారు రూ.4,968) ఉన్నట్లు అంచనా వేశారు. యాదగిరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రేబిస్ లక్షణాలతో వ్యక్తి మృతి

ఆత్మకూర్(ఎస్), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రెండు నెలల క్రితం కుక్క కాటుకు గురైన వ్యక్తి రేబిస్ లక్షణాలతో బుధవారం మృతిచెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని బొప్పారం గ్రామంలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని బొప్పారం గ్రామానికి చెందిన పరాల సతీష్ (34)కు రెండు నెలల క్రితం కుక్క కరిచింది. అతను చికిత్స కోసం ఆత్మకూర్(ఎస్) పీహెచ్‌సీకి రాగా ఇంజక్షన్ అందుబాటులో లేకపోవడంతో ఇంజక్షన్ తీసుకోలేదు. ఇటీవల సతీష్ అస్వస్థతకు గురయ్యాడు. దీంతో హైద్రాబాద్‌కు తీసుకెళ్ళి చికిత్స అందిస్తుండగా రేబిస్ లక్షణాలు బయటపడ్డాయి. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కూమార్తె, కుమారుడు ఉన్నారు.

చికిత్సపొందుతూ..

దామరచర్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలంలోని వాడపల్లి గ్రామానికి చెందిన సోమిరెడ్డి వెంకట్‌రెడ్డి(48) ఈ నెల 7వ తేదీన తన ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం దామరచర్ల వైపు నుంచి వాడపల్లి గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వాడపల్లి గ్రామ శివారులో సోమిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డురావడంతో సడన్ బ్రేక్ వేయగా అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో వెంకట్‌రెడ్డికి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం మిర్యాలగూడకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. వెంకట్‌రెడ్డికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


నల్లగొండ జిల్లా కేంద్రంలో ఎన్నికల సామగ్రి పంపిణీ పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తొలి విడత ఎన్నిక నేడు(గురువారం) నిర్వహించనున్నారు. ఈ ఎన్నికలకు ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. మండల కేంద్రాల్లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి సిబ్బందికి సామగ్రి పంపిణీ చేశారు. సామగ్రి పంపిణీని జిల్లా కలెక్టర్లు పరిశీలించి ఏర్పాట్లపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకే పోలింగ్ జరుగనుంది.
(ఆంధ్రజ్యోతి- న్యూస్‌నెట్‌వర్క్)


నల్లగొండలోని జూలకంటి ఇంద్రారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూటర్ సెంటర్‌లో సిబ్బంది


సూర్యాపేట జిల్లా మద్దిరాల డిస్ట్రిబ్యూటర్ సెంటర్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

తొలివిడత పంచాయతీ పోరు నేడే


నల్లగొండ మండలం అప్పాజీపేటలో పోలీస్ సిబ్బందికి సూచనలు చేస్తున్న జిల్లాఎస్పీ శరత్‌చంద్రపవార్




తుర్కపల్లిలో పోలింగ్ సామగ్రి పంపిణీ వివరాలను తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ హనుమంతరావు


సూర్యాపేట మండలం బాలెంలలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ నరసింహ


నార్కట్‌పల్లిలో సామగ్రి తీసుకెళ్లడానికి సిద్ధంగా ఉన్న బస్సులు


నల్లగొండ మండలం రాములబండ పోలింగ్ కేంద్రంలో సామగ్రి సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది


సూర్యాపేట జిల్లా తిరుమలగిరి నుంచి పోలింగ్ కేంద్రానికి సామగ్రితో వెళుతున్న అధికారులు, సిబ్బంది


రాజాపేట : రఘునాథపూర్‌లో సామాగ్రితో విధులకు వచ్చిన సిబ్బంది


తుర్కపల్లిలో భోజనం వడ్డిస్తున్న కలెక్టర్‌హనుమంతురావు

ఎస్సారెస్పీ రెండో దశ కాల్వకు భీంరెడ్డి పేరు పెట్టాలి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు(ఎస్సారెస్పీ) రెండో దశ కాల్వకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు భీంరెడ్డి నరసింహారెడ్డి(బీఎన్) పేరు పెట్టాలని పలువురు మేధావులు, విద్యావేత్తలు, ప్రముఖ పాత్రికేయులు డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు కోసం సుదీర్ఘకాలం పోరాడి, ఆనాటి ప్రభుత్వాల మీద ఒత్తిడి తెచ్చి మరీ విజయం సాధించిన బీఎన్‌పేరు కాకుండా, దానికి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి(ఆర్‌డీఆర్) పేరు ప్రకటించడం ఎంతమాత్రం సరికాదని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దామోదర్‌రెడ్డి బతికున్నప్పుడు కూడా ఎస్సారెస్పీ రెండో దశ కాల్వకు బీఎన్ పేరుపెట్టాలనే పలు బహిరంగ సభల్లో అభీష్టాన్ని తెలిపిన విషయాన్ని వారంతా గుర్తుచేశారు. 'గోదావరి నీళ్లతో నా గొంతు తడిసిన తర్వాత తుదిశ్వాస విడుస్తానని' ప్రకటించిన పోరాట యోధుడు బీఎన్ అని, ఆయన ఉద్యమ ఫలితంగానే నల్లగొండ జిల్లాకు గోదావరి జలాలు వచ్చాయని కొనియాడారు. బీఎన్ ఆలోచనా వేదిక ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ వేదికగా 'భీమిరెడ్డి, నర్సింహారెడ్డి జ్ఞాపకాలు, ఎస్సారెస్పీ కాల్వపేరు మార్పుపై సమాలోచనలు" అంశంపై సీనియర్ జర్నలిస్టు వర్దెల్లి మురళి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఎస్సారెస్పీ రెండవ దశ కాల్వకు, సూర్యాపేట జిల్లాకు బీఎన్ పేరుపెట్టాలని సభలో జూలూరు గౌరీశంకర్ తీర్మానాన్ని ప్రతిపాదించారు. దాంతో పాటు సూర్యాపేటలో ఆ మహనీయుడి స్మారకంగా ఆర్థిక, సామాజిక, రాజకీయ, వ్యవసాయ రంగాల పరిశోధనలకు ఆలవాలంగా ఓ విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి అందులో కోరారు. కార్యక్రమానికి హాజరైన ప్రముఖ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి, కె. శ్రీనివాస్, అల్లం నారాయణ, టంకశాల అశోక్, కట్టా శేఖర్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, సినీ దర్శకుడు ఎన్. శంకర్, విశ్రాంత ప్రొఫెసర్లు వినాయక్‌రెడ్డి, భగవంత్‌రెడ్డి తదితరులంతా తీర్మానానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆర్‌డీఆర్ ఎస్సారెస్పీ స్టేజ్-2గా నామకరణం చేస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవోను వెనక్కితీసుకోవాలని వారంతా ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. దీనిపై ఉమ్మడి నల్గొండ జిల్లా మంత్రులు సైతం స్పందించాలని కోరారు. ఇదే విషయమై సీఎం రేవంత్‌కు మెమోరాండం అందజేయాలని సమావేశంలో నిర్ణయించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను ఇష్టానురీతిగా వక్రీకరిస్తూ సినిమాలు తీస్తున్నారని దర్శకుడు ఎన్. శంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. వాస్తవ చరిత్రను భావితరాలకు తెలిపేలా చలనచిత్ర అభివృద్ధి మండలి ద్వారా తెలంగాణ ప్రభుత్వమే సినిమా నిర్మించాలన్నారు. కమ్యూనిస్టు పార్టీలు సైతం బీఎన్ త్యాగనిరతిని విస్మరించడం బాధాకరమని కట్టా శేఖర్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. బీఎన్ పేరును బీఆర్‌ఎస్ ప్రభుత్వమైనా ఆ ప్రాజెక్టుకు పెట్టుండాల్సింది అని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. చాకలి ఐలమ్మ పోరాటానికి దన్నుగా నిలిచి, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ముఖ్య భూమిక పోషించిన యోధుడు బీఎన్ అని నొక్కి చెప్పారు. ఈ విషయంలో ఇప్పటికైనా సీఎం రేవంత్ పునరాలోచించాలని గోరటి హితవుపలికారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతిని కాపాడుకుందాం. ఈ నేల చిహ్నాలను, వీరులను సముచితంగా గౌరవించుకుందాం అని కె.శ్రీనివాస్, అల్లం నారాయణ పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు రవికాంత్ రెడ్డి, దేగల జనార్ధన్, మారుతి సాగర్, బీఎన్ కుమారుడు ప్రభాకర్‌రెడ్డి, తెలంగాణ రీసోర్స్ సెంటర్ వ్యవస్థాపకుడు ఎం. వేదకుమార్, విజ్ఞాన దర్శిని తాటి రమేష్, న్యాయవాది నల్లగుంట అయోధ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కె. శ్రీనివాస్. చిత్రంలో టంకశాల అశోక్, జూలూరు గౌరీశంకర్, వర్దెల్లి మురళి, కె. రామచంద్రమూర్తి, కట్టా శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

చౌటుప్పల్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఓటర్లు పల్లె బాట పట్టడంతో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని 65వ నంబరు జాతీయ రహదారిపై బుధవారం వాహనాల రద్దీ నెలకొంది. మొదటి విడత పంచాయతీ ఎన్నికలు గురువారం జరుగుతుండడంతో హైదరాబాద్‌లో నివాసం ఉండే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సొంతూళ్లకు బయలు దేరారు. ప్రధానంగా ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలకు చెందిన ఓటర్లు పల్లెలకు ప్రయాణమయ్యారు. హైవేపై వాహనాలు నిండి పోవడంతో సర్వీస్ రోడ్ల వెంట పరుగులు తీశాయి. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే మార్గంలో వాహనాలు నిండి పోవడంతో రోడ్డుపై నడవలేని పరిస్థితి ఏర్పడింది. వాహనాలు నెమ్మదిగా ముందుకు కదిలాయి. ఆర్టీసీ బస్‌లు సైతం ప్రయాణికులతో కిటకిటలాడాయి. వాహనాల కోసం ప్రయాణిలు హైవే పై గుంపులు గుంపులుగా కనిపించారు ఏసీపీ మధుసూదన్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐలు మన్మథకుమార్, విజయ్ మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టి వాహనాలు జామ్ కాకుండా చూశారు. జంక్షన్ల వద్ద ట్రాఫిక్‌తో పాటు సివిల్ పోలీసులు సైతం వాహనాలను నియంత్రించారు.


చౌటుప్పల్ పట్టణంలో జాతీయ రహదారిపై బారులు తీరిన వాహనాలు

బాల్యానికి భరోసా ఇవ్వాలి

సూర్యాపేట టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించే సర్పంచ్‌లు, వార్డు సభ్యులు బాల్యానికి భరోసా కల్పించాలని అఖిల భారత బాలల హక్కుల పరిరక్షణ వేదిక జాతీయ అధ్యక్షుడు ఆర్.వెంకట్‌రెడ్డి కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో బాలల హక్కుల కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. మానవ వనరుల అభివృద్ధి గ్రామాభివృద్ధిలో భాగమని స్పష్టం చేశారు. పౌరులందరూ ఆరోగ్యంగా ఉండడం, పౌష్టికాహారం లోపం లేని పిల్లలు, బాల్య వివాహాలు లేకుండా చూడడం, బాల కార్మిక వ్యవస్థ లేకుండా చూడడం, బాలలందరికీ నాణ్యమైన విద్య అందించడం గ్రామాభివృద్ధిలో భాగమన్నారు. కార్యక్రమంలో ఎ.శివరాజు, జంపాల వెంకటేశ్వర్లు, శ్యాంసన్, లలిత, సైదులు, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

● ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్


సర్టిఫికెట్ల ప్రదానోత్సవంలో పాల్గొన్న వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, కళాశాల సిబ్బంది

దేవరకొండ, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానానికి ఎదగాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. దేవరకొండ మునగాల కొండల్‌రావు డిగ్రీ కళాశాల 11వ గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా బుధవారం 2024-25 విద్యాసంవత్సరానికి వివిధ సబ్జెక్టుల్లో బంగారు పతకాలకు ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి మాట్లాడారు. కళాశాలలో అడ్మిషన్లు పెంచడంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్య అవశ్యకతను వివరించారు. ఎంకేఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి, గోల్డ్‌మెడల్ కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థుల సంఘం సభ్యులు సముద్రాల ధనంజయ్య, శాంసన్, గాజుల రాజేష్, మల్లికార్జున్, జనార్దన్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ కోటయ్య, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'వైద్య విధాన పరిషత్‌ను రద్దు చేయాలి'

తుంగతుర్తి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వైద్య విధాన పరిషత్‌ను రద్దు చేసి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసును ఏర్పాటు చేయాలని సూర్యాపేట జిల్లా తుంగతుర్తి ఏరియా ఆస్పత్రి ఆరోగ్య సిబ్బంది కోరారు. ఈ మేరకు ఆర్‌ఎంవో ఉపేందర్‌కి బుధవారం వినతిప్రతం అందజేసి మాట్లాడారు. ప్రజారోగ్య పరిరక్షణలో కీలక సేవలందిస్తున్న వైద్య విధాన పరిషత్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు లేనందున, నెలనెలా వేతనాలు ఆలస్యం కావడంతో సమస్యలు ఎదుర్కొంటున్నామని తెలిపారు. వైద్య విధాన పరిషత్‌ను రద్దు చేసి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీస్ ఏర్పాటు చేసి జీతాలను ట్రెజరీ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. తమ సమస్యను సంవత్సరం క్రితమే ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చినా స్పందించలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది కరుణాకర్, సువర్ణ, నాగమణి, అనిత, నర్సింగ్ అధికారి కవిత తదితరులు పాల్గొన్నారు.

● హుజూర్‌నగర్: వైద్య ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు డి.నటరాజ్, శ్రీనివాస్ కోరారు. వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం పట్టణంలో నిరసన తెలిపి సూపరింటెండెంట్ ప్రవీణ్‌కు విన పత్రం అందజేశారు. ట్రెజరీల ద్వారా ఉద్యోగులకు ప్రతి నెలా వేతనాలు ఇవ్వాలన్నారు. వైద్యవిధాన పరిషత్‌ను రద్దుచేసి డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ ఏర్పాటు చేయాలన్నారు. ఆ కార్యక్రమంలో డాక్టర్ నక్కా రవికుమార్‌గౌడ్, డాక్టర్ గంటా నాగమణి, వెంకటాద్రి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గణేష్



భువనగిరి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు భువనగిరి శ్రీ వైష్ణవి జూనియర్ కళాశాలకు చెందిన మరికొండ గణేష్ ఎంపికయ్యాడు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం పట్నాలో ఈ నెల 13 నుంచి 17 వరకు జరుగనున్న 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో అండర్ -17 కేటగిరిలో 1500 మీటర్ల పరుగు పందెంలో తెలంగాణ నుంచి పోటీ పడనున్నారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో గణేష్‌ను కళాశాల ప్రిన్సిపాల్ మదిర మల్లేశం, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి గోపాల్, అభినందించి మెమెంటో అందజేశారు.

పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ జోక్యం తగదు

(ఆంధ్రజ్యోతి మిర్యాలగూడ)
రాజకీయ పార్టీలకు సంబంధం లేకుండా గ్రామసర్పంచ్ పదవులకు స్వతంత్ర అభ్యర్థులను ఎన్నుకునేలా రాజ్యాంగ నిబంధనలు ఉద్దేశించినప్పటికీ అందుకు పూర్తి భిన్నంగా ప్రస్తుత పంచాయతీ ఎన్నికలు కొనసాగుతున్నాయి. పార్టీల మద్దతుతోనే అభ్యర్థులను నిర్ణయించడం, వారి గెలుపుకోసం అన్ని పార్టీలో హోరాహోరీగా తలపడుతున్నాయి. ఈ ధోరణి సరికాదని గ్రామ అభివృద్ధిలో రాజకీయాలకు అవకాశం కల్పించొద్దని యువతీ, యువకుల మనోగతం. ప్రస్తుతం విద్యావంతులు, ఉన్నత ఉద్యోగాలు చేసేవారు సైతం సర్పంచ్ పదవిపై ఆసక్తి కనబరుస్తుడడం విశేషం. ఇలాంటి సందర్భంలో నీతి, నిజాయితీతో పారదర్శకంగా పాలన కొనసాగించాలని, గ్రామాభివృద్ధి నిధులతో మౌలిక సౌకర్యాల కల్పనపై దృష్టి సారించాలని యువత కోరుతున్నారు.

పార్టీలకతీతంగా నిస్వార్థ వ్యక్తులను ఎన్నుకోవాలి



సర్పంచ్ ఎన్నికల్లో పార్టీలకతీతంగా నిజాయితీ, నిస్వార్థత కలిగిన నాయకుడిని ఎన్నుకోవాలి. మహిళల స్వయం ఉపాధి కోసం ఉచిత కుట్టు, అల్లికల శిక్షణతో పాటు సమభావన సంఘాలకు రుణాలిప్పించి కుటీర పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పించే నాయకులకు ఓటువేసి గెలిపించాలి. పాఠశాలల అభివృద్ధి, వైద్యం, రోడ్డు సౌకర్యాలను మెరుగుపర్చాలి. మురుగునీటి కాల్వలను ఏర్పాటు చేసి పరిశుభ్రతకు ప్రాధాన్యతమిచ్చే విధంగా చర్యలు చేపట్టాలి.
- బి.గణేష్,ప్రైవేటు ఉద్యోగి, బొమ్మకల్

నిజాయితీగా ప్రజల సేవకు అంకితం కావాలి



రాజకీయ నేతల్లో అంకితభావం కొరవడుతోంది. ఎన్నికల్లో గెలుపొందిన ప్రజాప్రతినిధులు ప్రజాసమస్యలపై దృష్టి సారించడంలో విఫలమవుతున్నారు. ప్రజల ఓట్లతో ఎన్నికల్లో గెలిచిన సర్పంచ్‌లు, గ్రా మాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చాలి. విద్యావంతులు రాజకీయాల్లోకి వస్తే గ్రామానికి, సమాజానికి మేలు జరుగుతుంది. గ్రామప్రజలు సుపరిపాలనందించే వారిని గెలిపించాలి. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా విజ్ఞతతో ఓటును వినియోగించుకోవాలి. స్థానికంగా ఉంటూ ప్రజాసమస్యలను తీర్చే నాయకుడిని ఎన్నుకుంటే మంచిది. నేనే సర్పంచ్‌ని అయితే తాగు, సాగునీరు, విద్య, వైద్య సౌకర్యాలను కల్పించి గ్రామసర్వతోఖాభివృద్ధికి పాటుపడతాను.
- కడియం చంద్రరూప (బీ ఫార్మసీ విద్యార్థి, అభంగాపురం)

విద్యావంతులను ఎన్నుకోవాలి



విద్యావంతుడిని సర్పంచ్‌గా ఎన్నుకుంటే గ్రామాభివృద్ధి మెరుగుపడుతుంది. ఆర్థిక సంఘం నుంచి గ్రామాలకు వచ్చే నిధులను గ్రామాల్లో సౌకర్యాల కల్పనకు ఖర్చు చేస్తారు. ఎమ్మెల్యే, ఎంపీలను కూడా రప్పించి గ్రామాల్లోని అంతర్గత రోడ్ల నిర్మాణం, మురుగుకాల్వలు, తాగునీరు, వీధిలైట్లు వంటి సౌకర్యాలను మెరుగుపరిచేందుకు వీలుంటుంది. ప్రజలకు అవసరమయ్యే సౌకర్యాలపై అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి మార్గం సులభం చేస్తారు. ఆర్థిక లాభాపేక్షలేని, ప్రజాసేవకు అంకితమయ్యేవారిని ఎన్నికల్లో గెలిపించుకోవాలి. గ్రామాల్లో వైద్యసౌకర్యాలను మెరుగుపర్చాలి. పారిశుధ్యానికి అత్యంత ప్రాధాన్యతనివ్వాలి. ప్రతి మూడు నెలలకొకసారి గ్రామాల్లో గ్రామసభ నిర్వహించి ప్రజాసమస్యలేమిటో తెలుసుకొని వాటికి పరిష్కార మార్గం చూడాలి.
- నగిరి రీతు, డిగ్రీ విద్యార్థి, త్రిపురారం

బాధిత కుటుంబానికి పరామర్శ

ఆలేరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దహనమై నిరాశ్రయుడైన బాధిత సంగి యల్లయ్య కుటుంబాన్ని స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పరామర్శించారు. జరిగిన అగ్నిప్రమాద సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సహాయంతో పాటు బీర్ల ఫౌండేషన్ తరఫున 50 కిలోల బియ్యం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు తోడుగా ఉంటుందని మనోధైర్యం నింపారు.

ఏకగ్రీవ పంచాయతీల్లో ఉపసర్పంచులు వీరే

సంస్థాన్ నారాయణపురం, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సంస్థాన్ నారాయణపురం మండలంలో ఐదు గ్రామపంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. ఏకగ్రీవమైన గ్రామపంచాయతీలకు బుధవారం ఉపసర్పంచ్ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. కడపగండి తండా ఉపసర్పంచ్‌గా కరెంటోతు శీను, రాచకొండకు కరెంటోతు రాజు, గంగ మూలతండా కొర్ర రాజు, పల్లగట్టు తండా బానోతు ధర్మ, వాచ్య తండా వాంకుడోత్ రాజు ఎన్నికైనట్లు ఎంపీడీవో ప్రమోద్ కుమార్ తెలిపారు.

అభ్యర్థుల ఖరారు

మోత్కూరు, డిసెంబరు 10: (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మండలంలో ప్రధాన రాజకీయ పార్టీలో పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులను ఖరారు చేశాయి. పలుచోట్ల కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులు రెబల్స్ బెడదను ఎదుర్కొంటున్నారు. దీంతో కాంగ్రెస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులు పాలడుగు-యాస నర్సిరెడ్డి, దత్తప్పగూడెం-గుండు యాదగిరి, అనాజిపురం-బీసు వెంకటయ్య, పొడిచేడు-జిట్ట సైదులు, దాచారం కర్నే జ్యోతివీరేశం, పాటిమట్ల బండ రమవిజయ రెడ్డి, సదర్శాపురం-మునుకుంట్ల నీలకంఠం, ముశిపట్ల-పైళ్ల నర్సిరెడ్డి, పనకబండ-నకిరేకంటి సైదమ్మరామనర్సయ్య, రాగిబావి-గంట పద్మవెంకట్‌రెడ్డి అని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వంగాల సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

బీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థుల ఖరారు

మోత్కూరు మండలంలో కొన్ని గ్రామ పంచాయతీల్లో బీఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులు రెబల్స్ బెడదను ఎదుర్కొంటున్నారు. పనకబండలో లోతుకుంట రేణుకఅనిల్‌కుమార్, రాగిబావిలో మెండు శ్రీవాణిచంద్రశేఖర్‌రెడ్డి, పాటిమట్లలో గిరగాని ఉమశ్రీనివాస్, దాచారంలో చిల్లర లింగమ్మవీరయ్య, ముశిపట్లలో నేముల బుగ్గరాములు, సదర్శాపురంలో చిలుకల సురేష్, పాలడుగు మర్రిపల్లి శేఖర్, పొడిచేడు మెట్టు వీరస్వామి, అనాజిపురం చింతకింది చంద్రమౌళి, దత్తప్పగూడెంలో లోకసాని ఉదయ్‌కుమార్‌రెడ్డి తమ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులు అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు తొలి విడత పంచాయతీ పోరు

ఆలేరు రూరల్/ తుర్కపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆలేరు మండలంలో 16 గ్రామ పంచాయతీలు ఉండగా భైరాంనగర్, గ్రామ పంచాయతీ ఏకగ్రీవం కావడంతో కాంగ్రెస్ అభ్యర్థి కంపరాజు వెంకటేశ్వర్‌రాజు సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైంది. మిగతా 15 గ్రామాల్లో సర్పంచ్‌ల భవితవ్యం నేడు తేలనున్నది. 140 వార్డులకు గాను 12 వార్డులు ఏకగ్రీవం కావడంతో 128 వార్డులకు ఎన్నికలు జరుగనున్నాయి. నియోజకవర్గంలో 21,537 ఓటర్లు ఉండగా పురుషులు 10,501 స్త్రీలు 11,035 ఇతరులు ఒకరు ఉన్నారు. మండలంలో మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు గురువారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికల సామాగ్రితో సిబ్బంది గ్రామాలకు తరలి వెళ్లారు. మండలంలో మొత్తం 140 వార్డులు ఉండగా 132 పోలింగ్ బూత్‌లలో ఎన్నికలు జరుగనున్నాయి. ఇందు కోసం 132మంది పోలింగ్ అధికారులను 25 మంది రిజర్వ్‌డ్ పోలింగ్ అధికారులను, మొత్తం 150 మంది పెలింగ్ అధికారులను ఏర్పాటు చేశారు. జోనల్ అధికారులు ఆరుగురు, రిజర్వ్‌డ్ జోనల్ అధికారి ఒకరిని, రూట్ అధికారులను ఆరుగురిని ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, తహసీ



ఆత్మకూరు(ఎం): ఎన్నికల సామాగ్రిని చెక్ చేసుకుంటున్న పోలింగ్ సిబ్బంది

ల్దార్ ఆంజనేయులు తెలిపారు. అన్ని గ్రామాలకు పోలింగ్ సామాగ్రిని తరలించామని ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

తుర్కపల్లి: మండలంలో 33 గ్రామ పంచాయతీలకుగాను కోనాపూర్, వేలుపల్లి, గుజ్జవానికుంట తండా, రామోజీనాయక్ తండ, చోక్ల తండ గ్రామాలు ఏకగ్రీవం కాగా మండలంలో 28 గ్రామ పంచాయతీలు, 173 వార్డుల్లో ఎన్నికలు జరగనున్నాయి. 28 పంచాయతీలలో సర్పంచ్ పదవీకి 88 మంది అభ్యర్థులు, 173 వార్డుల్లో 434 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. కాగా మండలంలో ఈ ఎన్నికలు నిర్వహించేంచేందుకు 173 పోలింగ్ కేంద్రాలు, 236 మంది పీవోలు, 243 మంది ఓపీవోలను నియమించారు. మండలాన్ని ఐదు జోన్లుగా పది రూట్‌లను ఏర్పాటు చేశారు. పోలింగ్ సిబ్బంది, పోలింగ్ సామాగ్రిని ఆయ గ్రామాలకు తరలించేందుకుగాను 27 బస్‌లను ఏర్పాటు చేసారు. ఎన్నికలను ప్రక్రియను పర్యవేక్షించేందుకు జోనల్ ఆఫీసర్లకు మరో ఐదు వాహనాలను ఏర్పాటు చేసినట్లు ఎన్నికల ఇన్‌చార్జి సురేశ్‌కుమార్, ఎంపీడీఓ గీతారెడ్డి తెలిపారు.



తుర్కపల్లి : సామగ్రి పరిశీలనలో పోలింగ్ సిబ్బంది

ఎన్నికల్లో ఎలాంటి అలజడులు జరగకుండా ఎండేందుకు పోలీసులు పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్ఐలు, 166 మంది పోలీస్ సిబ్బందిని నియమించినట్లు ఎస్ఐ తక్యుద్దీన్ తెలిపారు.

ఆత్మకూరు(ఎం) :1 మండల కేంద్రంలో ఎన్నికల సామాగ్రిని పోలింగ్ సిబ్బందికి పంపిణీ చేశారు. మండలంలో 23 గ్రామపంచాయతీలకు గాను ఉప్పల్‌పహడ్, రాయిపల్లి, సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. 21 గ్రామపంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. 21 సర్పంచ్ స్థానానికి 49 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మండలంలో 192 వార్డు సభ్యులకు గాను 26 వార్డులు ఏకగ్రీవం కాగ 166 స్థానాలకు 352 మంది సభ్యులు పోటీ చేస్తున్నారు. గురువారం జరిగే ఎన్నికలకు 221మంది పీవోలను, 229 మంది ఓపీవోలను , 26మంది స్టేజీ-2 అధికారులను, 6 జోనల్ అధికారులను నియమించారు. ఎన్నికల సామగ్రి పంపిణీని మండల స్పెషల్ ఆఫీసర్, ఆర్డీవో కృష్ణారెడ్డి పర్యవేక్షించారు. డీసీబీ అక్షాంశ్‌యాదవ్ బుధవారం ఆత్మకూరు, పల్లెర్ల, కూరెళ్ల గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

రాజాపేట : రాజాపేట మండలంలో ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండలంలోని 23 గ్రామ పంచాయతీలు, 206 వార్డు సభ్యులకు గాను 2 పంచాయతీలు, 23 వార్డులు ఏకగ్రీవం కాగా 21 సర్పంచ్ పదవులకు 63 మంది, 183 వార్డులకు 434 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. మండలంలో 505 మంది ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారని ఎంపీడీవో నాగవేణి బుధవారం తెలిపారు. ఎన్నికల సామగ్రి పంపిణీ పూర్తి చేశామని తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లను అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర రావు పర్యవేక్షించారు. 180 మంది పోలీసు సిబ్బంది, ఇద్దరు సీఐలు మండలంలో ఈసారి విధులను నిర్వహిస్తున్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



మోత్కూరు: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో బాలాజీ

మోత్కూరు/అడ్డగూడూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఖచ్చితంగా పాటించాలని, నియమావళిని అతిక్రమిస్తే తగిన చర్యలు తీసుకుంటారని ఎంపీడీవో డి.బాలాజీ, ఎన్నికల ఖర్చు పరిశీలకుడు వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం మోత్కూరు మండల పరిషత్ కార్యాలయంలో అభ్యర్థులకు ఎన్నికల నియమావళి, ఎన్నికల ఖర్చుపై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. సంబంధిత అధికారుల నుంచి ముందుగా అనుమతి పొందాకే వాహనాలు, మైక్ వినియోగించాలన్నారు. మద్యం, డబ్బు లాంటి వాటితో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే నేరమవుతుందన్నారు. అభ్యర్థులు కొత్తగా తీసుకున్న బ్యాంకు ఖాతా ద్వారానే ఎన్నికలకు ఖర్చు చేయాలని, ఖర్చులు ప్రతి రోజు రాయాలని, సర్పంచ్ అభ్యర్థులు రూ.1.50లక్షలు, వార్డు సభ్యులు రూ.30 వేలకు మించకుండా ఖర్చు చేయాలన్నారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శాంతి భద్రతలకు భంగం కలుగకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. గ్రామాల్లో ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు ముందుగా అనుమతి తీసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ పి.జ్యోతి, ఎంపీవో పైళ్ల జనార్దన్‌రెడ్డి, డీటీ వెంకటేశ్వర్‌రెడ్డి, సహాయ ఖర్చు అధికారి రాంనర్సయ్య, ఎంపీఎస్‌వో కృష్ణ, ఆర్ఐ సుమన్, ఏఈవోలు టి.గోపీనాథ్, ఎం.అశోక్, సింహప్రసాద్ పాల్గొన్నారు.

అడ్డగూడూరు: మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్నికల వ్యయ నిర్వహణ జిల్లా నోడల్ అధికారి వెంకట్‌రెడ్డి, ఎంపీడీవో శంకరయ్య అభ్యర్థులకు అవగాహన కల్పించారు. ఎంపీవో ప్రేమాలత, ఎన్నికల వ్యయ నిర్వహణ పరిశీలకులు మల్లేష్ పాల్గొన్నారు.

ఐకమత్యంతోనే అభివృద్ధి

రామన్నపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఐకమత్యంగా ముందుకు సాగితేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వీరేశం అన్నారు. బుధవారం మండలంలోని నిదాన్‌పల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ అభ్యర్థి కొండ అండాలు మల్లయ్యను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, మాజీ సర్పంచ్‌లు గుత్త నర్సిరెడ్డి, కొండ బుచ్చిబాబు, గంగుల కృష్ణారెడ్డి, మందడి ఉదయ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రెహాన్, మొగులయ్య, నరేష్, లక్ష్మణ్, భిక్షం పాల్గొన్నారు.

సమన్వయంతో సాగాలి

చౌటుప్పల్ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామస్థులంతా సమన్వయంతో చర్చించుకుని గ్రామ అభివృద్ధికి బాటలు వేసుకోవాలని పలువురు సూచించారు. చౌటుప్పల్ మండలం ఎల్లగిరి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన రిక్కల మహేందర్‌రెడ్డి ఎన్నిక ధ్రువపత్రాన్ని స్టేజ్-1 అధికారి బుధవారం అందజేశారు. ఏకగ్రీవంగా ఎన్నికైన మహేందర్ రెడ్డిని మాజీ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, నాయకులు సతీష్, భూపాల్ రెడ్డి, వినయ్, పెద్దగోని రమేశ్ గౌడ్ అభినందించారు.

సేవచేసేవారినే ఆదరించాలి

వలిగొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు సేవచేసే అభ్యర్థులనే సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం సంగెం, వర్కట్‌పల్లి, గోకారం, జాలుకాల్వ, గొల్నేపల్లి, నాగారం, వలిగొండ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పైళ్ల శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో లేని వ్యక్తులను సర్పంచ్‌లుగా ఎన్నుకుంటే ఇబ్బందులు తప్పవన్నారు. డబ్బులు, మద్యానికి లోబడకూడదని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తుమ్మల వెంకట్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు అఫ్రోజ్, నాయకులు సురకంటి వెంకట్‌రెడ్డి, వెంకన్న, మొగుళ్ల శ్రీనివాస్, జంగారెడ్డి, రమేష్, పైళ్ల మోహన్‌రెడ్డి, శ్రీను, సంజీవరెడ్డి, సత్యనారాయణ ఉన్నారు.

పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉండాలి

భూదాన్‌పోచంపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎంతటి వారైనా పార్టీ సమష్టిగా తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండాలని కాంగ్రెస్‌పార్టీ మండల కోర్ కమిటీ సభ్యులు హెచ్చరించారు. బుధవారం భూదాన్‌పోచంపల్లిలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్‌పార్టీ మండల కోర్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మండలంలోని 20 గ్రామపంచాయతీల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఆయా గ్రామాల్లోని కాంగ్రెస్ కార్యకర్తల పనితీరును అధిష్ఠానం గ్రహిస్తోందని, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను పార్టీ గుర్తిస్తుందని, భవిష్యత్తులో పార్టీ వారికి మంచి అవకాశాలు కల్పిస్తుందన్నారు. పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ఓటు చోరీని అరికట్టాలి




సంతకాల సేకరణ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మోత్కూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓటు చోరీకి పాల్పడి, ప్రజాస్వామ్య వ్యవస్థను ఖూనీ చేసి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందని పలువురు కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. బుధవారం మోత్కూరు అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఓటు చోరీని అరికట్టాలని సంతకాలను సేకరించారు. పార్లమెంటులో ప్రతిపక్ష నేత చోటు చోరీని వెలుగులోకి తెచ్చినా ఎన్నికల సంఘం స్పందించడం లేదని విమర్శించారు. ఓటు చోరీ వ్యవహారాన్ని గడపగడపకు తీసుకెళుతామన్నారు. తాము సేకరించిన సంతకాలను టీపీసీసీకి పంపుతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరిరెడ్డి, నాయకులు డాక్టర్ గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, అవిశెట్టి అవిలిమల్లు, గడ్డం నర్సింహ, మందుల సురేష్, వల్లపు సమ్మయ్య, ఎండి.మునీర్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే కుంభం

వలిగొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ప్రజాపాలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టి పలు అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. సన్నబియ్యం పంపిణీ, రేషన్‌కార్డులు అందజేత, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు వంటి పథకాలు ప్రవేశపెట్టామని తెలిపారు. ఈ ప్రాంత రైతుల అభివృద్ధికి తాగునీటి కాల్వలు బునాదిగానే, ధర్మారెడ్డిపల్లి, పిలాయిపల్లి కాల్వల ఆధునీకరణ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కసుబా శ్రీనివాసరావు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు పాశం సత్తిరెడ్డి, పట్టణ అధ్యక్షులు కంకల కిష్టయ్య, నాయకులు కుంభం వెంకటపాపిరెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, తుమ్మల యుగేందర్‌రెడ్డి, చేగూరి భాగ్యవతి మల్లేశం, కరుణశ్రీ, రవి, శంకర్, రమేష్ పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదు



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మోత్కూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ సీఎం రేవంత్‌రెడ్డిపై, స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలుపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ జిల్లా నాయకులు డాక్టర్ లక్ష్మీనర్సింహారెడ్డి, రామచంద్రు హెచ్చరించారు. బుధవారం మోత్కూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో ఇక తాము అధికారంలోకి రాలేమన్న భయం కిషోర్‌కుమార్‌లో కనుపిస్తోందన్నారు. విద్యార్థి నాయకుడినని చెప్పుకునే కిషోర్‌కుమార్ ఏనాడైనా నిరుద్యోగ సమస్యలపై మాట్లాడారా అని ప్రశ్నించారు. అప్పటి సీఎం కేసీఆర్‌ను ఒక్కసారైనా ఉస్మానియా యూనివర్సిటీకి తీసుకెళ్లారా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే సుమారు 60 వేల ఉద్యోగాలు ఇచ్చారని, పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించేందుకు రూ20 వేల కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తుంటే బీఆర్ఎస్ నాయకులు చూడలేకపోతున్నారన్నారు. మార్కెట్ డైరెక్టర్లు పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, పోచం జగన్, మునిసిపల్ మాజీ కౌన్సిలర్ బొడ్డుపల్లి కళ్యాణ్‌చక్రవర్తి, నాయకులు మందుల సురేష్, అన్నెపు పద్మ, పల్లపు సమ్మయ్య, పోల్నేని స్వామిరాయుడు, పాలోజు శేఖరాచారి, దేవరపల్లి అశోక్‌రెడ్డి, సురిగల దశరథ వారి వెంట ఉన్నారు.

పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

అడ్డగూడూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిమ్మనగోటి జోజి అన్నారు. బుధవారం అడ్డగూడూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు పాల్పడుతున్నందువల్ల కాంగ్రెస్ పార్టీ నుంచి కడారి రమేష్, గూడేపు పాండు, గూడేపు నాగరాజు, మారిశెట్టి మల్లేష్‌ను కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కొప్పుల నిరంజన్ రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు పూలపెల్లి సోమిరెడ్డి, నాయకులు బాలెంల విద్యసాగర్, బొమ్మగాని లక్షమ్మయ్య, రవీందర్ ఉన్నారు.

పోలింగ్ విధులు సమర్థంగా నిర్వహించాలి

- విధులకు గైర్హాజరైనవారికి షోకాజ్ నోటీసు
- కలెక్టర్ హనుమంతరావు ఆదేశం



యాదగిరిగుట్టలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

యాదగిరిగుట్ట రూరల్, డిసెంబరు 10, (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సిబ్బంది పోలింగ్ విధులు సమర్థంగా నిర్వహించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం బుధవారం స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన మొదటి విడుత డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు కేటాయించి ఉద్యోగులు అందరూ వచ్చారా లేదాయని జిల్లా ఎన్నికల అధికారిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 11న జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ విధులకు గైహాజరైన వారికి కలెక్టర్ నోటీసులు జారీచేశారు. విధులకు హాజరుకాని వారిపై క్రమ శిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని, గైహాజరైన వారందరికి వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది అందరూ పోలింగ్ సామగ్రి అయిన బ్యాలెట్ బాక్సులు సులువుగా ఓపెన్ అవుతాయా? లేదా చెక్‌చేసుకోవాలన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా వేరు చేసి సిద్ధంగా ఉండాలని, డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటింగ్ నిర్వహణ ఏర్పాటు చేసూకోవాలని, ఫారం 9 ప్రకారం అన్ని చెక్ చేసుకోవాలని ఆదేశించారు. చెక్ లిస్ట్ ప్రకారం గ్రామ పంచాయతీకి సంబంధించిన స్టాంపులు అన్నీ వచ్చాయా లేదా, స్వస్తిక్ మార్క్ ఉందోలేదో మరోసారి చెక్‌చేసుకోవాలని చెప్పారు. సర్పంచ్ వార్డు సభ్యులకు బ్యాలెట్ పేపర్లు ప్రతీ ఓటరుకు ఇవ్వాలని, ఓటరు బ్యాలెట్ బాక్స్‌లో రెండు బ్యాలెట్ పేపర్లు వేశారా లేదాయని క్షుణ్ణంగా పరిశీలించుకోవాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఒక్కరు ఎన్నికల నియమ నిబంధనలు పాటించాలని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులు, సిబ్బందికి సూచించారు. ఆయనతో పాటుగా సంబంధిత అధికారులు పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరుగకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటుగా స్థానిక ఎంపీడీవో నవీన్‌కుమార్, తహసీల్దార్ గణేష్‌నాయక్ పాల్గొన్నారు.

తుర్కపల్లి: ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా సిబ్బందికి పోలింగ్ సామగ్రిని పక్కాగా అందించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మండల కేంద్రంలో ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని సందర్శించి, సామాగ్రి పంపిణీ తీరుతెన్నులను ఆయన పరిశీలించి మాట్లాడారు. పోలింగ్ సిబ్బందికి చెక్ లిస్ట్ ఆధారంగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి అందినదా? లేదా అని పరిశీలించుకోవాలన్నారు. ఈ సందర్భంగా పోలింగ్ సిబ్బందికి కలెక్టర్ స్వయంగా భోజనం వడ్డించారు. ఆయన వెంట మండల ఎన్నికల ఇన్‌చార్జి గుర్రం సురేష్, ఎంపీడీఓ లెంకల గీతారెడ్డి, తహసీల్దార్ జలకుమారి, ఎంఈవో వి.మాలతి ఉన్నారు.

రాజాపేట: మండలంలో ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మండలంలోని 23గ్రామ పంచాయతీలు, 206వార్డు సభ్యులకు గాను 2 పంచాయతీలు, 23వార్డులు ఏకగ్రీవం కాగా 21 సర్పంచ్ పదవులకు 63 మంది, 183 వార్డులకు 43 4 మంది అభ్యర్థులు రంగంలో ఉన్నారు. మండలం లో 505 మంది ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారని ఎంపిడివో నాగవేణి బుధవారం తెలిపారు. ఎన్నికల ఏర్పాట్లను అడిషనల్ డిసిపి లక్ష్మీనారాయణ,అదనపు కలెక్టర్‌లు వీరారెడ్డి, భాస్కరరావు పర్యవేక్షించారు.

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు



కొలనుపాకలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీపీ అక్షాంశ్‌యాదవ్

ఆలేరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించే భారీ బందోబస్తు ఏర్పాటు చేశామని డీసీపీ అక్షాంశ్‌యాదవ్ అన్నారు. బుధవారం ఆలేరు మండలం కొలనుపాకలోని పోలింగ్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదుగురు సబ్ ఇన్స్‌పెక్టర్లతో పాటు 150మంది పోలీస్ సిబ్బంది ఈ ఎన్నికల విధులను నిర్వహిస్తున్నారన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో ఆర్మ్‌డ్ పోలీసులను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ర్యాలీలు, సమావేశాలు నిర్వహించవద్దని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా శాంతియుతంగా జరిగేలా ప్రజలు అన్ని రాజకీయ పక్షాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు, ఆలేరు సీఐ యాలాద్రి, ఎస్ఐ వినయ్ తదితరులు ఉన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్ట డివిజన్ పరిధిలోని ఈ నెల 11న 95 గ్రామ పంచాయతీల్లో జరగనున్న సర్పంచ్, వార్డు సభ్యుల పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. బుధవారం గుట్టలో విలేకరులతో మాట్లాడుతూ 157 పోలింగ్ కేంద్రాలు, 810 బూత్‌లు, అందులో సమస్యాత్మక గ్రామాలు 366 వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఈ నెల10నుంచి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రధానంగా బందోబస్తులో ఏసీపీతో పాటుగా ఆరుగురు సీఐలు, ఎస్ఐలు 20, ఏఎస్ఐలు 10 మంది, హెడ్ కానిస్టేబుల్స్ 50 మంది, 300 మంది పీసీలు, 200 మంది సాయుధ బలగాలు, అదనంగా ప్రత్యేక అధికారులు, ఎస్‌టీటీ బలగాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్, కౌటింగ్ కేంద్రాల నుంచి 100 మీటర్ల దూరంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో ఎన్నికల నియమాలను అందరూ పాటించి ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు.

ఆర్థిక అసమానతలు లేని సమాజమే లక్ష్యం



వలిగొండలో అవగాహన కల్పిస్తున్న లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మామిడి వెంకట్‌రెడ్డి

వలిగొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కుల, మత, లింగ, ప్రాంతీయ, ఆర్థిక అసమానతలు లేని సమాజమే రాజ్యాంగం లక్ష్యమని లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మామిడి వెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని లోతుకుంట ఆదర్శ పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. మానవ హక్కుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన కేంద్ర మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ సభ్యులు గణేష్, శ్రీశైలం, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామన్నపేట : రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్-1,2 సామాజిక శాస్త్రాల విభాగాల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ రహత్‌ఖానం మాట్లాడుతూ ప్రపంచ ప్రజల హక్కులను కాపాడడం కోసం ఐక్యరాజ్యసమితి డిసెంబరు 10న మానవ హక్కుల దినోత్సవంగా ప్రకటించిందన్నారు. భారత పౌరులు స్వేచ్ఛగా వారి హక్కులను అనుభవించే అవకాశం భారత రాజ్యాంగం కల్పించిందని, ప్రభుత్వాలు మానవ హక్కులు కాపాడడం కోసం చట్టాలు కూడా చేశాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎం.అనిత, టి.శ్రీనివాసులు, కిషన్, సునీత, బ్రహ్మం, శ్రీను, నరేష్, ఆంజనేయులు, రాధిక, విద్యార్థులు పాల్గొన్నారు.

గుండాల: అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ దినోత్సవం సందర్భంగా మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సూదగాని హరికృష్ణ గౌడ్, మండల చైర్మన్ సోమనారాయణ, వైస్ చైర్మన్ మోహన్, ఆవుల సురేందర్, మహేశ్ పాల్గొన్నారు.

వలస ఓటర్లపై గురి

రాజాపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సర్పంచ్, వార్డుమెంబర్ల ఎన్నికలో వలస ఓటర్లు కీలకంగా మారనున్నాయి. బతుకుదెరువు కోసం పట్టణాలకు వలస వెళ్లిన ఓటర్లు ప్రతీ గ్రామంలో ఉన్నారు. గ్రామాల్లో ఉన్న ఓటర్లలో 15 నుంచి 30 శాతం ఓటర్లు వలస ఓటర్లుగా ఉన్నారు. నామినేషన్ వేసి రంగంలో ఉన్న అభ్యర్థులు వలస ఓటర్ల పైనే దృష్టిని సారించారు. గెలుపు, ఓటములు నిర్ణయించేది వారేనని, వారి రాక కోసం రవాణా ఇతర సౌకర్యాలను అభ్యర్థులు పోటీలు పడి ఏర్పాటు చేశారు. కొంత మందికి ఫోన్‌పే, గూగుల్‌పేల ద్వారా డబ్బులను అభ్యర్థులు అందజేసినట్లుగా పలువురు చర్చించుకుంటున్నారు. రాజకీయ పార్టీల వారీగా, అభ్యర్థుల వారీగా ఎవరికి వారుగా పట్టణాల్లో ఇప్పటికే మకాంవేశారు. గుంపులుగా, ఒంటరిగా తిరుగుతూ ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. ఎలాగైనా ఓటింగ్‌లో పాల్గొనేలా చూస్తున్నారు.